సాక్షి వికారాబాద్

సోమవారం, 22, జనవరి, 2024



ఆపదలో ఆప్తమిత్రులు

కష్టాల్లో ఉన్నప్పుడు దేవుడి ప్రతిరూపంగా, ప్రమాదం సంభవించినప్పుడు 108 వాహన సిబ్బంది ఆదుకుంటున్నారు. 8లో▸



వరి నాట్లకు వలస కూలీలు!

వరి నాట్ల విస్తీర్ణం పెరుగుతుండడంతో కూలీల కొరత తీవ్రమైంది. దీంతో పొరుగు రాష్ట్రాల కూలీలను ఆశ్రయిస్తున్నారు. 8లో▸



శిథిలావస్థలో బస్టాండ్!

ప్రయాణికుల సౌకర్యార్థం మండల కేంద్రంలో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ నిరుపయోగంగా మారింది. 9లో▸

న్యూస్‌రీల్

నేడు రామదండు మహా శోభాయాత్ర

తెల్లచొక్క తప్పనిసరి

కొడంగల్: పట్టణంలో సోమవారం రామదండు మహా శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు రామదండు కమిటీ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అయోధ్య రామమందిర నిర్మాణం నేపథ్యంలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా మహా శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 8 గంటలకు పట్టణంలోని మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి శాంతినగర్ కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయం వరకు ఈ ఊరేగింపు ఉంటుందన్నారు. 11గంటలకు అభయాంజనేయ స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అయోధ్యలో శ్రీబాలరాముడి ప్రాణప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారం వీక్షిస్తూ సామూహిక అక్షింతల ఆశీర్వచనం పొందాలన్నారు. అనంతరం అన్న ప్రసాదం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. భక్తులు ప్రతి ఒక్కరూ తెల్ల చొక్క ధరించి రావాలని కోరారు.

వయోజనులు ఓటు నమోదు చేసుకోవాలి

ఆర్డీఓ విజయకుమారి



కుల్కచర్ల: ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీఓ

కుల్కచర్ల: వయోజనులంతా ఓటుహక్కు నమోదు చేసుకోవాలని వికారాబాద్ ఆర్డీఓ విజయకుమారి అన్నారు. ఆదివారం ఆమె మండల కేంద్రంలో ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన వారంతా ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు ముందుకు రావాలన్నారు. అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. తప్పులుంటే సరిచేయాలని అధికారులకు చెప్పారు. మృతి చెందిన వారి ఓట్లను జాబితా నుంచి తొలగించాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ మురళీధర్, పంచాయతీ కార్యదర్శి రవి తదితరులున్నారు.

ఓటు.. రాజ్యాంగం కల్పించిన హక్కు

పెద్దేముల్: ఓటు అనేది ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కు అని ఆర్ఐ రాజిరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని నాగులపల్లితో పాటుగా పలు గ్రామాల్లో పర్యటించి ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మోదీ పాలనలో కార్మికులకు కష్టాలు

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వర్‌రావు



మాట్లాడుతున్న ఈశ్వర్‌రావు

వికారాబాద్ అర్బన్: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వర్‌రావు ఆరోపించారు. ఆదివారం ఆయన పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈశ్వర్‌రావు మాట్లాడుతూ.. ప్రతీ ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి ఉన్న ఉద్యోగాలు తీసేస్తున్నారని విమర్శించారు. పదేళ్ల మోదీ పాలనలో కార్మికులకు కష్టాలు మిగిలాయే తప్ప ఎలాంటి లాభం చేకూరలేదన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.మహిపాల్, జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, ఉపాధ్యక్షుడు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకారులను ఆదుకోవాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాఘవాచారి

ఆమనగల్లు: అన్ని రంగాల్లో వెనుకబడిన స్వర్ణకారులకు ప్రభుత్వం అండగా ఉండాలని స్వర్ణకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వింజమూరు రాఘవాచారి విజ్ఞప్తి చేశారు. యాభై ఏళ్లు పైబడిన స్వర్ణకారులకు పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలోని కళ్యాణి గార్డెన్స్‌లో ఆదివారం నూతన స్వర్ణకార సంఘం ప్రమాణస్వీకారం, స్వర్ణకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాఘవాచారి మండల స్వర్ణకార సంఘం అధ్యక్షులు కాసోజు రాము చే ప్రమాణ స్వీకారం చేయించారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

జిల్లా వ్యాప్తంగా ఉన్న నాలుగు మున్సిపాలిటీల్లోనూ పారిశుద్ధ్యం లోపించింది. చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోతోంది. మురుగు రోడ్లపైనే పారుతోంది. అధికారుల అలసత్వం ప్రజలకు ఇబ్బందిగా మారింది.

నిలిచి పోయిన చెత్త సేకరణ

- రోడ్లపైనే పారుతున్న మురుగు
- కానరాని కంపోస్టు ఎరువు తయారీ
- పట్టించుకోని మున్సిపల్ కమిషనర్లు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



జిల్లా కేంద్రంలో దుస్థితి

వికారాబాద్: పట్టణాల్లో పారిశుద్ధ్య సమస్య తీవ్రమవుతోంది. పల్లెల్లో పారిశుద్ధ్య నిర్వహణ ఒకింత మెరుగుపడినా.. పట్టణాల పరిస్థితి దారుణమవుతోంది. ఏర్పాటు చేసిన చెత్త కుండీలను తొలగించడం, చెత్త సేకరణ వాహనాలు రాకపోవడంతో చెత్తంతా వీధుల్లో పేరుకుపోతోంది. మున్సిపాలిటీ పరిధిలో ఇలా ఉంటే.. అనుబంధ గ్రామాలు అధ్వానంగా మారాయి. పన్నులు వసూలు చేస్తున్న అధికారులు వసతుల కల్పనలో విఫలమవుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దోమలు, ఈగల బెడద

చెత్త డంప్ చేస్తున్న పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీల్లో డంప్ చేస్తున్న చెత్త తీసే వారు లేక అది కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు, ఈగలు వ్యాప్తి చెంది కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని సూచిస్తున్న అధికారులు ఆదిశగా మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. తడి,పొడి చెత్తనంతా సేకరించి శివారు ప్రాంతాలకు తరలించి డంప్ చేస్తున్నారు.

మూణ్నాళ్ల ముచ్చటగా కంపోస్టు తయారీ

మున్సిపాలిటీ పరిధిలోని చాలా కాలనీల్లో దుర్గంధం పేరుకుపోయింది. నివాసాల మధ్య మురుగు పారుతుండడంతో పందులు, దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. రూ.కోట్లలో నిధులు ఖర్చు చేస్తున్నామని చెబుతున్నా.. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టిన దాఖలాలే లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. జిల్లా పరిధిలోని వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నాలుగు మున్సిపాలిటీల్లోనూ చెత్త సేకరణ అధ్వానంగా మారింది. గతంలో వికారాబాద్, తాండూరు, పరిగి మున్సిపాలిటీల్లో కంపోస్టు ఎరువులు తయారు చేసి పట్టణ ప్రకృతి వనాలు, నర్సరీల్లో మొక్కల పెంపకానికి వినియోగించేవారు. ఈ తతంగమంతా కొంతకాలం నడిపించి వదిలేశారు.

మున్సిపాలిటీల వారీగా..

తాండూరు మున్సిపాలిటీలో 36 వార్డులుండగా 80 వేల జనాభా ఉంది. ప్రతిరోజు 44 మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతుంది. ఇక్కడ తడి, పొడి చెత్త వేరు చేసే ప్రక్రియకు ఆరంభంలోనే స్వస్తి పలికారు. కొన్ని రోజులు కంపోస్టు యూనిట్లు ఏర్పాటు చేసి ఎరువులు తయారు చేసి అనంతరం స్వస్తి పలికారు. తడి, పొడి చెత్త శివారులోని డంపింగ్ యార్డులో పారబోస్తున్నారు.

- పరిగి మున్సిపాలిటీలో 15 వార్డులుండగా 30వేల జనాభా నివసిస్తున్నారు. ఇక్కడ పది మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతుంది. తడి, పొడి చెత్త వేరు చేస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ అది ఎక్కడా కనిపించటంలేదు. చెత్తంతా ఒకే చోట జమ చేసి పట్టణ పరిసరాల్లో రెండు మూడు చోట్ల డంప్ చేస్తున్నారు.
- కొడంగల్ మున్సిపాలిటీలో 12 వార్డులుండగా 22వేల జనాభా ఉంది. రోజుకు సగటున ఆరు మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతుంది. తడి, పొడి చెత్త వేరుచేసే ప్రక్రియ ప్రారంభించలేదు.
- వికారాబాద్ మున్సిపల్ పరిధిలో 34 వార్డులుండగా 90 వేల జనాభా పట్టణంలో నివాసముంటున్నారు. మున్సిపల్ పరిధిలో రోజుకు సగటున 32 మెట్రిక్ టన్నులు సేకరిస్తున్నారు. జిల్లా కేంద్రమైన వికారాబాద్‌లోనూ తడి, పొడి చెత్త వేరు చేసే ప్రక్రియ చేపట్టడంలేదు. గతంలో కంపోస్టు ఎరువు తయారీ చేపట్టగా ప్రస్తుతం మూతబడింది. వారానికి 400 కిలోల కంపోస్టు ఎరువు తయారు చేశారు. మున్సిపల్ పరిధిలో ఏ కాలనీలో చూసినా చెత్త కుప్పలే కనిపిస్తున్నాయి.

అంగట్లో అంగన్‌వాడీ గుడ్లు

- రూ.5 చొప్పున చౌడాపూర్ మార్కెట్‌లో విక్రయం
- 20 ట్రేల గుడ్లను స్వాధీనం చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు



గుడ్లపై వేసిన ప్రభుత్వ చిహ్నం

కుల్కచర్ల: బాలింతలు, చిన్నారులు, గర్భిణలకు అందజేసే అంగన్‌వాడీ కోడి గుడ్లు చౌడాపూర్‌లో ప్రత్యక్షమయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. చౌడాపూర్ మండల పరిధిలోని మందిపల్ గ్రామానికి చెందిన పల్లాటి పెంటయ్య ఆదివారం ప్రధాన రహదారిపై కోడిగుడ్లు విక్రయిస్తున్నాడు. ఒక్కో గుడ్డు రూ.5 చొప్పున అమ్ముతున్నట్లు బోర్డు పెట్టాడు. గుడ్లపై ఉన్న ప్రభుత్వ చిహ్నం గుర్తించిన స్థానికులు మీడియా, పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ అక్కడకు చేరకుని 20 ట్రేలు(సుమారు 600) గుడ్లను స్వాధీనం చేసుకుని కుల్కచర్ల పోలీసులకు అందజేశారు. నిందితుడిని నిలదీయండంతో గుడ్లను మహబూబ్‌నగర్ జిల్లా నుంచి కొనుగోలు చేసినట్లు అంగీకరించినట్లు సమాచారం. ప్రభుత్వం ఉచితంగా సరఫర చేస్తున్న కోడి గుడ్లు అమ్ముతున్న సదరు వ్యక్తితో పాటుగా వీరికి అమ్మతున్న వారిపై విచారించి తగు చర్యలు తీసుకోవాలని సూపర్‌వైజర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిద్రావస్థలో 'ఐసీడీఎస్'

అంగన్‌వాడీ సరుకులు పక్కదారి పడుతున్నాయని పలు సందర్భాల్లో ఆరోపణలు వస్తున్నా.. ఐసీడీఎస్ అధికారులు పర్యవేక్షించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని కొన్ని గ్రామాల్లోనూ ఇదే తంతు కొనసాగుతోంది. తాజాగా ఆదివారం అంగన్‌వాడీ సెంటర్లకు సంబంధించిన కోడిగుడ్లు బహిరంగ మార్కెట్‌లో అమ్ముతున్న ఘటనను తెలుసుకున్నారు. అక్కడివెళ్లి పరిశీలించగా గుడ్లపై ఉన్న స్టిక్కర్‌ను గుర్తించి అవి ఎక్కడిఓ చెప్పలేని పరిస్థితిలోఉన్న ఐసీడీఎస్‌పై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇట్టి విషయమై సీడీపీఓ ప్రియదర్శినిని వివరణ కోరగా.. అంగన్‌వాడీ కేంద్రాలను నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం. పరిగి నియోజకవర్గ పరిధిలో బయట మార్కెట్‌ల్లో అమ్మడం మాదృష్టికి ఎప్పుడూ రాలేదన్నారు. పోలీసులను విచారణ చేపట్టామని వివరించారు.



అంగన్‌వాడీ కేంద్రానికి చెందిన కోడిగుడ్లను విక్రయిస్తున్న పెంటయ్య

శ్రీరామ జపయజ్ఞం



పట్టణంలోని ఆర్యవైశ్య భవన్‌లో ఆదివారం శ్రీరామ జయరామ జయ జయ రామ మహా జపయజ్ఞ మహోత్సవం నిర్వహించారు. సంఘం పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, ఆధ్యాత్మిక వక్త భాస్కరయోగి, వివిధ పార్టీల నాయకులు, రామభక్తులు పాల్గొన్నారు.

– వికారాబాద్ అర్బన్

ఔటర్‌పై వాహనాల తనిఖీ

ఇబ్రహీంపట్నం: ఆదిబట్ల పీఎస్ పరిధిలోని బొంగ్లూర్ ఓఆర్ఆర్ వద్ద పోలీసు ఉన్నతాధికారులు ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. రాచకొండ క్రైం డీసీపీ అరవిందబాబు, మహేశ్వరం అదనపు డీసీపీ సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం ఏసీపీ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది సుమారు 790 వాహనాలను తనిఖీ చేశారు. ఇటీవల గుర్తుతెలియని దుండగులు గోనె సంచిలో మృతదేహన్ని మూటగట్టి ఔటర్ రోడ్డు కింద పడవేయడం, గంజాయిని తరలించడంలాంటి సంఘటనలు జరిగిన నేపథ్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారుల నుంచి బయోమెట్రిక్ ద్వారా వేలిముద్రలు తీసుకున్నారు. గ్రీన్ ఫార్మాసిటీ సీఐ రామాంజనేయులు, ఆదిబట్ల ఎస్‌ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

మల్లయ్యకు పుడమిరత్న విశిష్ట సేవాపురస్కారం

ఆమనగల్లు: మండలంలోని శెట్టిపల్లి గ్రామానికి చెందిన జానపద కళాకారుడు సింగని మల్లయ్య పుడమిరత్న విశిష్ట సేవా పురస్కారం అందుకున్నారు. పుడమి సాహితీ వేదిక ఏటా వివిధ రంగాల్లో సేవలు అందించిన పలువురిని విశిష్ట సేవా పురస్కారాలతో సత్కరిస్తోంది. ఈ ఏడాది జానపద కళారంగం నుంచి మల్లయ్యను ఎంపికచేశారు. ఈ మేరకు నల్లగొండ జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.

ప్రత్యేక దళం.. కబ్జాల పర్వం!

- అయితే ఆక్రమణ.. లేదంటే నకిలీ డాక్యుమెంట్లు
- రాత్రికి రాత్రే కంటైనర్లు.. చుట్టూ రేకుల ప్రహరీలు
- వాటికి కాపలాగా బౌన్సర్లు, వీధి రౌడీలు
- నేతల అండతో రెచ్చిపోతున్న కబ్జారాయుళ్లు



మహేశ్వరం పరిధిలోని ఓ ప్రభుత్వ భూమిలో పహిల్వాన్ల పహారా (ఫైల్)

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వ, వివాదాస్పద భూముల్లో ప్రైవేటు సైన్యం రాజ్యమేలుతోంది. భూముల ధరలు ఎక్కువగా ఉన్న గండిపేట్, శంకర్‌పల్లి, నార్సింగి, శంకర్‌పల్లి, మొయినాబాద్, రాజేంద్రనగర్, శంషాబాద్, మహేశ్వరం, కొంగరకలాన్‌లో ఈ ముఠాలు హల్‌చల్ చేస్తున్నాయి. ప్రభుత్వ, వివాదాస్పద ఖాళీ భూములు కన్పిస్తే చాలు వాటిలో దూరిపోతున్నాయి. రాత్రికి రాత్రే కంటైనర్లు వేస్తున్నారు. అప్పటి వరకు పొజిషన్‌లో ఉన్న అసైన్డ్ దారులను, రైతులను అక్కడి నుంచి బలవంతంగా బయటికి పంపుతున్నారు. కళ్లముందే ఇంత జరుగుతున్నా.. వీరి అరాచకాలను పోలీసులు నియంత్రించలేకపోతున్నారు. బాధితుల పక్షాల నిలబడి వారికి న్యాయం చేయాల్సింది పోయి.. సెటిల్‌మెంట్లను ప్రోత్సహిస్తూ పరోక్షంగా భూ ఆక్రమణదారులకు అండగా నిలుస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. మొయినాబాద్, శంకర్‌పల్లి, పహడీషరీఫ్, ఆదిబట్ల, శంషాబాద్, మీర్‌పేట పోలీసులపై తరచూ ఇదే తరహా ఫిర్యాదులు రావడం.. ఉన్నతాధికారులు వారిపై వేటు వేయడం పరిపాటిగా మారింది.

పాతేయ్ జెండా

ఔటర్ రింగ్‌రోడ్డు సహా, అంతర్జాతీయ విమానాశ్రయం ఇక్కడే కొలువై ఉంది. రియల్ ఎస్టేట్ రంగం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఐటీ అనుబంధ సంస్థలు, దేశీయ, విదేశీ కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి. దీంతో ఇక్కడి భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఎకరం వంద కోట్లకుపైగా పలుకుతోంది. పట్టా భూముల క్రయవిక్రయాలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉండటంతో కబ్జాదారుల కన్ను ప్రభుత్వ, అసైన్డ్, భూదాన్, వక్ఫ్, దేవాదాయ, ఇతర వివాదాస్పద భూములపై పడింది. ఇంకేముందు స్థానిక నేతలు, సంబంధిత శాఖల అధికారుల సహకారంతో రంగంలోకి దిగుతున్నారు.

బౌన్సర్లు.. స్ట్రీట్ ఫైటర్లు

భూములను సొంతం చేసుకునేందుకు కబ్జాదారులు ఓ ప్లాన్ ప్రకారం ముందుకు వెళ్తున్నారు. ముందు వాటికి నకిలీ డాక్యుమెంట్లు సృష్టిస్తున్నారు. వీరికి ఆయా ప్రాంతాల్లోని తహసీల్దార్లు, ఆర్ఐలు, సబ్ రిజిస్ట్రార్లు, ఏజెంట్లు సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆ తర్వాత పాతబస్తీ నుంచి పహిల్వాన్లు, ఇతర బాడీ బిల్డర్లను, స్ట్రీట్ ఫైటర్లను రోజువారీ కూలీకి రప్పించి వివాదాస్పద భూముల్లోకి బలవంతంగా చొరబడుతున్నారు. ఇందుకోసం ప్రత్యేక ఏజెన్సీలే ఏర్పడ్డాయి. వీరు అప్పటి వరకు పొజిషన్‌లో ఉన్న వారిని బెదిరించి, అక్కడి నుంచి బలవంతంగా బయటికి పంపేస్తున్నారు. పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేస్తే.. సివిల్ వివాదాల పేరుతో వారు చర్యలకు నిరాకరిస్తున్నారు. కోర్టును ఆశ్రయించాల్సిందిగా సూచిస్తున్నారు. బాధితుల్లో చాలామందికి ఆ శక్తి లేకపోవడంతో సెటిల్‌మెంట్లకు యతిస్తున్నారు. అయినా వినకుండా ఎదురు తిరిగిన వారిపై దాడులకు కూడా వెనుకాడటం లేదు. ఇందుకు వారికి పోలీసులు కూడా సహకరిస్తున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. ఇలాంటి ఆరోపణలపై ఇటీవల జిల్లాలోని ముగ్గురు సీఐలపై వేటు వేసిన విషయం తెలిసిందే.

పొజిషన్ కోసం పోటీ

ఓ ఉద్యోగికి పట్టినాగులపల్లిలో ఎకరానికి పైగా భూమి ఉంది. డాక్యుమెంట్లన్నీ పక్కగా ఉండటంతో ఇంతకాలం ఆయన ధీమాగా ఉన్నారు. ఇదే భూమికి మరికొన్ని నకిలీ డాక్యుమెంట్లు పుట్టుకొచ్చాయి. ఇంకేముందు భూ యజమానికి, కబ్జాదారులకు మధ్య వివాదం మొదలైంది. పొజిషన్ కోసం రెండు పార్టీలు పోటాపోటీగా యతించాయి. ఓవైపు సర్దార్‌జీలు.. మరోవైపు స్ట్రీట్ ఫైటర్లు వెరసి.. రెండు వర్గాల మధ్య ప్రత్యక్ష యుద్ధమే కొనసాగింది.

బౌన్సర్లు వర్సెస్ రైతులు

ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధి కొంగరకలాన్ రెవెన్యూ పరిధిలో పెద్ద ఎత్తున వక్ఫ్, అసైన్డ్ భూములు ఉన్నాయి. నేతల అండతో కొంత మంది రియల్టర్లు అధికారులతో కుమ్మక్కై.. వీటికి నకిలీ పత్రాలు సృష్టిస్తున్నారు. ఈ భూములు తమవేనంటూ రంగంలోకి దిగుతున్నారు. ముందు బౌన్సర్లను రంగంలోకి దింపుతున్నారు. వా రు రాత్రికి రాత్రే ఆ భూముల్లోకి చొరబడి పొజిషన్‌లో ఉన్న రైతులను బలవంతంగా బయటికి పంపి, చుట్టూ ఫెన్సింగ్ చుట్టేస్తున్నారు. రైతులంతా ఏకమై బౌన్సర్లను తరిమికొట్టడం, వారిపై కేసులు నమోదు చేయడం, ఆ తర్వాత వారికి డబ్బు ఆశచూపి రాజీ కుదుర్చుకోవడం తెలిసిందే.

నకిలీలతో కబ్జా

మీర్‌పేట్ ఠాణా జెడ్పీ రోడ్డు పరిధిలో నివసించే ఓ ఎంఆర్ఓ ఇటీవల తన ఇంటి ముందు ఖాళీగా ఉన్న 280 గజాల ప్లాటును సంబంధిత ఓనర్ నుంచి కొనుగోలు చేశారు. అగ్రిమెంట్ చేసుకుని, తీరా ప్రహరీ నిర్మించే సమయంలో ఓ నకిలీ డాక్యుమెంట్ల ముఠా తెరపైకి వచ్చింది. స్థానిక ప్రజాప్రతినిధి అండతో ఇలా ఇప్పటికే ఈ ముఠా 16 ప్లాట్లకుపైగా కబ్జా పెట్టింది. ముఠా ఆగడాలను అడ్డుకోవాల్సిన స్థానిక పోలీసులు పరోక్షంగా వీరికి సహకరిస్తున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. కబ్జాదారుల ఆగడాలను అరికట్టాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

క్లుప్తంగా

ముగిసిన టోర్నమెంట్



ట్రోఫీతో దేవులానాయక్‌తండా జట్టు

బొంరాస్‌పేట: మండల స్థాయిలో రెండు రోజులుగా బొట్లోనితండాలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. కార్యక్రమంలో భాగంగా విజేతలైన జట్లకు నగదు బహుమతులతోపాటు జ్ఞాపికలను అందజేశారు. మొదటి బహుమతి సాధించిన దేవులానాయక్‌తండా జట్టుకు రూ.22,222, రెండో బహుమతి బొట్లోనితండాకు రూ.11,111 నగదును అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నీటి గుంతలో పడి వ్యక్తి మృతి

శంకర్‌పల్లి: నీటి గుంతలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మోకిల పోలీస్‌స్టేషన్ పరిధిలోని జనవాడ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. గ్రామానికి చెందిన చాకలి కృష్ణ(45) రో జు మాదిగానే బర్రెలు మేపేందుకు పొలాలకు వెళ్లా డు. మధ్యాహ్నం వాటికి నీరు తాపేందుకు గుంత వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు కాలు జారి అందులో పడిపోయాడు. కాగా నీరు ఉన్న ప్రాంతంలో జేసీబీతో గతంలో గుంతలు తీయడంతో పెద్దఎత్తున లోతు ఏర్పడింది. దీంతో మునిగి చనిపోయాడు. మృతుడికి భార్య పద్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కోటేశ్వర్‌రావు తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

మొయినాబాద్: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి 11 మందిని అరెస్టు చేశారు. ఈ సంఘటన మొ యినాబాద్ మండల పరిధిలోని చిన్నమంగళా రం రెవెన్యూలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిన్నమంగళారం రెవెన్యూ పరిధిలోని రాక్ గార్డెన్‌లో కొంత మంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఆదివారం రాత్రి పోలీసులు దాడి చేశారు. 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న 10 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

యువకుడి అదృశ్యం

మొయినాబాద్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన మండల పరిధిలోని బాకారంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సిరిగిరి వసంత, కృష్ణ దంపతుల రెండో కుమారుడు శ్రీకాంత్ ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. శనివారం అతడు ఇంటి వద్దే ఉన్నాడు. తల్లిదండ్రులు ఉదయం 9 గంటలకే పనికి వెళ్లారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన శ్రీకాంత్ తిరిగి రాలేదు. దీంతో ఆదివారం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సర్పంచ్, కార్యదర్శిపై కేసు నమోదు

మేడ్చల్ రూరల్: గ్రామంలోని ఉన్న వీధి కుక్కలను ఎలాంటి సంరక్షణ లేకుండా అటవీ ప్రాంతానికి తరలించిన గ్రామ సర్పంచ్, గ్రామ పంచాయతీ కార్యదర్శిపై పోలీసులు కేసు నమోదు చేసిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శామీర్‌పేట్ మండలం మురహరిపల్లి గ్రామంలో ఉన్న వీధి కుక్కలను సర్పంచ్ భాస్కర్, గ్రామ కార్యదర్శిలు ఇటీవల గ్రామం నుంచి తీసుకెళ్లి అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. ఈ నెల 9న విషయం తెలుసుకున్న స్ట్రే యానిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ పీసీఏ మేనేజర్ గౌతమ్, పీసీఏ అసిస్టెంట్ లక్ష్మీ ప్రసన్నలు సర్పంచ్‌ను విషయంపై ఆరా తీయగా గ్రామంలో వీధి కుక్కల బెడద వల్ల వాటిని అటవీ ప్రాంతానికి తరలించినట్లు ఒప్పుకున్నాడు. మరింత సమాచారం కోసం కుక్కలను వదిలిపెట్టిన ప్రాంతాన్ని సందర్శించిన పీసీఏ అసిస్టెంట్ వీధి కుక్కల తరలింపు కారణంగా వాటికి ఆహారం, నీటి కొరత ఏర్పడి మరణించే స్థితికి చేరడంతో ఈ మేరకు లక్ష్మీప్రసన్న మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. జంతు సంరక్షణ చర్యలు తీసుకోకుండా కుక్కలను తరలించిన వారిపై యానిమల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరడంతో ఈ మేరకు మేడ్చల్ పోలీసులు విచారణ జరిపి కేసు నమోదు చేశారు.

ఆపదలో ఆప్తమిత్రులు

- ప్రమాదం సమయంలో ఈఎంటీల సేవలు కీలకం
- ఎంతో మంది ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది

కష్టాల్లో ఉన్నప్పుడు దేవుడి ప్రతిరూపంగా, ప్రమాదం సంభవించినప్పుడు 108 వాహన సిబ్బంది ఆదుకుంటున్నారు. ఇందులో పని చేసే ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తూ ఇప్పటి వరకు వేల సంఖ్యలో ప్రాణాలు కాపాడారు. వాహనంలో పనిచేసేందుకు దేవుడు ఇచ్చిన వరంలా సిబ్బంది భావిస్తున్నారు. అప్రమత్తతతో ఎక్కడ ప్రమాదం జరిగినా మెరుపు వేగంతో సంఘటనా స్థలానికి చేరుకొని సమీపంలోని ఆస్పత్రికి క్షతగాత్రులను తరలిస్తూ ప్రాణాలను కాపాడేందుకు కృషి చేస్తున్న సిబ్బందికి బాధిత కుటుంబ సభ్యులు అభినందనలు తెలుపుతున్నారు.

కొడంగల్ రూరల్ : దివంగత ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన పథకంలో భాగంగా ఎక్కడ, ఎప్పుడు ప్రమాదం జరిగినా అత్యవసరంగా ఘటనా స్థలికి వెళ్లి ప్రాణాలను రక్షించడానికి 108 సిబ్బంది కృషిచేస్తున్నారు. సంఘటనా స్థలంలోనే క్షతగాత్రులకు రక్తస్రావం ఎక్కువ కాకుండా అవసరమైతే ప్రథమ చికిత్స అందిస్తున్నారు. సమీపంలోని ఆస్పత్రులకు తరలించేందుకు ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్స్(ఈఎంటీ)లు కృషిచేస్తున్నారు. అంబులెన్స్‌లో ఆక్సిజన్ సౌకర్యం, డెలివరీ కిట్, ఎవరైనా పురుగు మందు తాగితే వారిని కాపాడడానికి కావాల్సిన పరికరాలతో ప్రాథమిక చికిత్స అందిస్తున్నారు. జిల్లాలో 18 మండలాల పరిధిలో 12వాహనాలున్నాయి. ఈ క్రమంలో గతేడాది జనవరిలో 1025, ఫిబ్రవరిలో 1235, మార్చిలో 1130, ఏప్రిల్‌లో 1088, మేలో 1120, జూన్‌లో 1205, జులైలో 1308, ఆగస్టులో 1209, సెప్టెంబర్‌లో 1320, అక్టోబర్‌లో 1250, నవంబర్‌లో 1075, డిసెంబర్‌లో 1130లతో మొత్తం 14,095 కేసులను 108వాహన సిబ్బంది ఆస్పత్రులకు తరలిస్తూ చికిత్స అందించారు. వీరిలో ఎంతో మంది ప్రాణాలు కాపాడుతూ ఆపద్బాంధవులుగా నిలుస్తున్నారు.



వాహనంలో మహిళకు ప్రసవం చేసిన ఈఎంటీ (ఫైల్)

క్షతగాత్రులను తరలిస్తూ..



108లో ఉద్యోగం చేయడం ఆనందంగా ఉంది. ప్రమాదాలు జరిగిన సమయంలో క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలిస్తూ ప్రాణాలు కాపాడడంతో ఎంతో పుణ్యంగా భావిస్తున్నాను. బాధితులు ఓ వైపు బాధపడుతూనే మమ్మల్ని అభినందించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ప్రాణాలు కాపాడిన సంఘటనలు జీవితంలో గుర్తుండిపోతాయి.

– అశోక్, ఈఎంటీ, కొడంగల్

ప్రాణాలు కాపాడడమే ముఖ్యం



ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు సమాచారం తెలుసుకున్న వెంటనే ఘటనా స్థలానికి త్వరగా చేరుకునేందుకు ప్రయత్నిస్తాం. వారిని ఆస్పత్రికి తరలించి వారి ప్రాణాలు కాపాడితే చాలా తృప్తినిస్తుంది.

– ఖలీం, పైలెట్, కొడంగల్

సమాచారం అందిన వెంటనే



సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలానికి వెళ్లేందుకు ప్రయత్నిస్తాం. బాధితులు, పరిసరవాసులు సహాయంతో క్షతగాత్రులను వాహనంలో ఎక్కించేందుకు కృషిచేస్తాం.

– ఆంజనేయులు, ఈఎంటీ, కొడంగల్

నిరంతర సేవలు



జిల్లాలో 12వాహనాల ద్వారా నిత్యం మెరుగైన సేవలు అందిస్తున్నాం. 108 వాహనాల్లో అవసరమైన వారికి అత్యవసర వైద్య సేవలు అందించే ఈఎంటీలు ఉన్నాయి. జిల్లాలో గతేడాది 14,095 కేసులను ఆస్పత్రులకు తరలించారు.

– వసంత్, 108 వాహన జిల్లా ప్రోగ్రాం మేనేజర్



ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేస్తున్న యువతీ, యువకులు

కోట్‌పల్లి.. షికారుకెళ్లి

ధారూరు: మండలంలోని కోట్‌పల్లి ప్రాజెక్టు ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. సెలవు రోజు కావడంతో ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజలు తమ కుటుంబాలతో వాహనాలు, ప్రైవేటు బస్సుల్లో రాగా, యువతీ, యువకులు బైక్‌లపై ఉదయాన్నే చేరుకున్నారు. కుటుంబాలతో వచ్చిన పర్యాటకులు చెట్ల కింద సేదతీరడం, అక్కడే వంటావార్పు చేపట్టడం కన్పించింది. ప్రాజెక్టు నీటి వెనకాల కన్పిస్తున్న అడవి అందాలతో ఫొటోలు దిగారు. ప్రాజెక్టు అందాలను ఆస్వాదించిన తర్వాత అక్కడే వన భోజనాలు చేసి సాయంత్రం వెళ్లిపోయారు. యువతీ, యువకులు గంటల తరబడి బోటింగ్ చేస్తూ ఎంజాయ్ చేశారు.

ఉపాధి దెబ్బతిని.. ఉరేసుకొని

- ఆటో డ్రైవర్ ఆత్మహత్య
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన



రాహుల్ (ఫైల్)

బొంరాస్‌పేట: జీవనోపాధి కోసం తెచ్చుకున్న ఆటో గిరాకీ దెబ్బతిన్నదని ఆందోళన చెందిన ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండల పరిధిలోని బాపల్లితండాలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. తండాకు చెందిన బామినిబాయి, బాలునాయక్‌లకు అనిల్, సురేశ్, రాహుల్(21) ముగ్గురు సంతానం. చిన్న కుమారుడు రాహుల్ ఐదు నెలల క్రితం రూ.2.80 లక్షలకు ఫైనాన్స్‌లో ఆటో తీసుకొని హైదరాబాద్‌లోని కాశీమందిర్ ప్రాంతంలో ఆటో నడుపుతూ ఉపాధి పొందుతున్నాడు. నెలరోజులుగా ఆటో గిరాకీ దెబ్బతిన్నదని ఆందోళనకు గురయ్యాడు. గురువారం మధ్యాహ్నం అద్దెంట్లో ఫ్యానుకు ఉరేసుకొని చనిపోయాడు. మరో యువకుడు సాయంత్రం చూసి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. మహిళలకు కల్పించిన ఉచిత బస్సు ప్రయాణం పథకమే కారణమంటూ కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆదివారం కోరుతున్నారు.

సస్యరక్షణే ముఖ్యం

- పత్తితీత తర్వాత చేనును తొలగించండి
- వ్యవసాయాధికారి జయశంకర్



మొయినాబాద్‌పేటలోని ఎన్కేపల్లిలో పత్తి చేను తొలగిస్తున్న రైతు

మొమిన్‌పేట: పత్తితీత వెంటనే చెట్లను తీసేయాలని వ్యవసాయాధికారి జయశంకర్ పేర్కొన్నారు. లేదంటే వచ్చే సంవత్సరం పత్తి వేస్తే గులాబి రంగు పురుగు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంటుందని ఆయన అన్నారు. గత నవంబరులో కురిసిన వర్షానికి పత్తి చేనుకు ఆకులు రావడంతో భూసారాన్ని పూర్తిగా మొక్కలు తీసుకుంటాయని ఆయన తెలిపారు. భూమి కొంత మేర ఎండిన వెంటనే లోతుగా ట్రాక్టరుతో దున్నుకోవాలని అన్నారు. లోతుగా దున్నుకోవడం వలన భూమిలో ఉండే పురుగులు, అవి పెట్టిన గుడ్లు పూర్తిగా ఎండకు నశించిపోతాయన్నారు. దీంతో విత్తనం నాటడానికి ముందు వర్షం పడిన మొలక మొలిచేందుకు అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. రైతులు ట్రాక్టరుతో దున్నుకునేందుకు ఎక్కువగా డబ్బు ఖర్చు అవుతుందని గోర్రు వేస్తారు. అలా చేయడంతో నీరు ఎక్కువగా భూమిలోకి ఇంకిపోదన్నారు. ఖరీఫ్‌లో సాగుకు సమాయత్తం కోసం వేసవి దుక్కులు తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. రైతులు ఇప్పుడు దున్నుకొని వేసవిలో వర్షాలు కురిస్తే మళ్లీ ట్రాక్టరుతో వేయాల్సి వస్తుందని చాలా మంది రైతులు ఖరీఫ్‌కు ముందు కొన్ని రోజులకు దున్నుకోవడం చేస్తున్నారని ఆయన అన్నారు. అలా చేయడంతో భూమి సారవంతంగా ఉండక పోగా ఖరీఫ్ పంటలు ఎదగలేకపోతాయని దీంతో దిగుబడులు తగ్గుతాయని ఆయన పేర్కొన్నారు. రైతులు పత్తి చేనును వెంటనే తీసి వేసి లోతుగా దున్నుకొవాలని కోరారు.

వరి నాట్లకు వలస కూలీలు

- పొరుగు రాష్ట్రాల నుంచి రాక
- రైతులకు తప్పిన ఇబ్బందులు

దోమ: గ్రామాలలో వరి నాట్ల విస్తీర్ణం పెరుగుతుండడంతో కూలీల కొరత తీవ్రమైంది. దీంతో రైతులు చేసేది లేక మధ్యవర్తుల ద్వారా పొరుగు రాష్ట్రాల నుంచి కూలీలను రప్పించి పనులు చేసుకుంటున్నారు. యాసంగి సీజన్ ప్రారంభమైనప్పటికీ చాలా మంది రైతులు వరి నాట్లు వేయలేకపోయారు. ఓ పక్క బోర్లు తగ్గడం, మరో పక్క చలి తీవ్రతతో నారు మడులు పాడైపోవడం, కూలీల కొరత ఏర్పడడంతో రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ఆలస్యమైన నాట్లు వేసేందుకు రైతులు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నారు. మహారాష్ట్ర, బిహార్, ఉత్తరప్రదేశ్ నుంచి కూలీలను రప్పించి నాట్లు వేయిస్తున్నారు.

ముందుగా ఒప్పందం

మండలంలోని ఆయా గ్రామాలకు వరి నాట్లు వేసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి కూలీలు వచ్చారు. ఒక్కొక్క బృందం పన్నెండు మంది వరకు ఉంటున్నారు. కొందరు కమీషన్ ఏజెంట్లు కూలీలతో ముందుగా ఒప్పందం చేసుకొని వరి నాట్లు వేసేందుకు పంపిస్తున్నారు. వారికి వసతితో పాటు సామగ్రిని అందిస్తున్నారు. అయితే వరి నాట్లు వేసేందుకు మధ్యవర్తులు ఎకరానికి రూ.5,500 నుంచి రూ.ఆరు వేల వరకు తీసుకొని కొంత మంది కూలీలకు రూ.3,500 నుంచి రూ. 4 వేల వరకు చెల్లిస్తున్నారని తెలుస్తోంది. మరికొంత మంది కూలీలు నేరుగా రైతులతో మాట్లాడి ఒప్పందం కుదుర్చుకొని వరి నాట్లు వేస్తున్నారు. దీంతో కొంత మేర ఇబ్బందులు తప్పయని రైతులు చెబుతున్నారు.



వరి నాట్లు వేస్తున్న మహారాష్ట్ర కూలీలు

జిల్లా అభివృద్ధికి తోడ్పాటునివ్వండి

కేంద్ర మంత్రికి విన్నవించిన బీజేపీ నాయకులు



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ధారూరు: వికారాబాద్ జిల్లా అభివృద్ధి చెందేందుకు తోడ్పాటును అందించాలని ఆదివారం జిల్లా బీజేపీ నాయకులు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసిన నాయకులు అనంతగిరిగుట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూ.100 కోట్ల నిధులు కేటాయించిన కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అనంత పద్మనాభస్వామి దేవస్థానానికి రాష్ట్రంలో మంచి గుర్తింపు లభించేలా కృషి చేస్తున్న మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అన్ని రంగాల్లో పూర్తిగా వెనుకబడిన జిల్లాను అభివృద్ధికి చేయూతనందించాలన్నారు. అనంతరం వారు కేంద్రమంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్, నాయకులు నరోత్తమ్‌రెడ్డి, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

వందేళ్లయినా లెనిన్ ప్రభావం ఉంది



లెనిన్‌కు నివాళులర్పిస్తున్న కూనంనేని, చాడ తదితరులు

హిమాయత్‌నగర్: రష్యాన్ విప్లవోద్యమ సారధి లెనిన్ మరణించి 100 సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ ఆయన ప్రభావం ప్రపంచంపై ఉందని సీపీఐ శాసనసభ పక్ష నాయకులు కూనంనేని సాంబశివ రావు అన్నారు. సోవియట్ యూనియన్ నిర్మాత వ్లాదిమిర్ లెనిన్ 100వ వర్ధంతిని పురస్కరించుకొని హిమాయత్‌నగర్‌లోని మగ్దూం భవన్‌లో లెనిన్‌కు సిపిఐ నాయకులు నివాళులర్పించారు. లెనిన్ చిత్రపటానికి కూనంనేని సాంబశివ రావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్య పద్మ, వి.ఎస్.బోస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సాంబశివ రావు మాట్లాడుతూ చరిత్రలో కారల్ మార్క్స్ పేరు ఉంటే ఆయన పక్కన లెనిన్ పేరు ఉండాల్సిందే అన్నారు. లెనిన్ వర్ధంతి పురస్కరించుకొని పార్టీని పటిష్టంగా నిర్మాణం చేసుకోవాలని కోరారు. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా లెనిన్ ఆచరించిన, అమలు పరిచిన ఆయన ఆలోచన విధానాన్ని అవలోకన చేసుకొని, లెనిన్ చూపిన బాటలో నడవాలన్నారు.

ఘనంగా శోభన్‌బాబు జయంతి

గన్‌ఫౌండ్రీ: అందాల నటుడు శోభన్‌బాబు సినీ ప్రేక్షకుల గుండెలో చిరస్థాయిగా నిలిచి ఉంటారని సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ బండారు సుబ్బారావు అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో శోభన్‌బాబు 88వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీ నటులు ఆమని, రోజారమణిలకు పురస్కారాలను ప్రదానం చేశారు. అంతకు ముందు గాయనీ గాయకులు ఆలపించిన సంగీత విభావరి ఆహుతులను ఆకట్టుకుంది. తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కె.దామోదర్‌గుప్తా, కళాపత్రిక సంపాదకులు మహ్మద్ రఫీ, సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి ఆమని తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవా అవార్డు

అత్తాపూర్: అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కుమార్‌యాదవ్‌కు ఉత్తమ సేవా అవార్డు దక్కింది. సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి చేతుల మీదుగా ఆయన ఆదివారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయాలనే ఉద్దేశంతోనే పోలీసుశాఖలో చేరానన్నాడు. కానిస్టేబుల్ నుంచి హెడ్ కానిస్టేబుల్‌గా ఎదగటంతో పా టు పలు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఉన్నతాధికారు ల మన్ననలు అందుకునేలా పనిచేశానన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని.. యువకుడి దుర్మరణం

మరొకరికి తీవ్ర గాయాలు

యాచారం: ఆర్టీసీ బస్సు, బైక్‌ను ఢీకొనడంతో ఓ వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందగా, మరోవ్యక్తికి తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ సీఐ రామాంజనేయులు తెలిపిన వివరాలు.. మల్కీజ్‌గూడెం గ్రామానికి చెందిన ఆలంపల్లి కరుణాకర్(20), నక్కర్తమేడిపల్లి గ్రా మానికి చెందిన సింగం బాషయ్యలు యాచారం నుంచి బైక్‌పై ఆదివారం నక్కర్తమేడిపల్లి గ్రామానికి వెళ్తున్నారు. యాచారం వైపు వస్తున్న ఇబ్రహీంపట్నం ం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు, బైక్‌లు మార్గమధ్య లో ఉన్న కల్వర్టు వద్ద ఢీకొన్నా యి. ఈ ప్రమాదంలో కరుణాకర్‌కు, బాషయ్యకు తీవ్ర గాయాలు అయ్యా యి. ఇద్దరిని నగరంలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో కరుణాకర్ మృతి చెందాడు. బాషయ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుండెపోటుతో సీఆర్పీఎఫ్ జవాను మృతి

ప్రభుత్వ లాంఛనలతో అంత్యక్రియలు

తుక్కుగూడ: గుండెపోటుతో సీఆర్పీఎఫ్ జవాను మృతి చెందిన సంఘటన తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కందికంటి ఈశ్వర్(58) నగరంలోని హకీంపేట్ సీఆర్పీఎఫ్ సెంటర్‌లో జవానుగా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం విధుల్లో ఉండగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన మరణంతో స్వగ్రామంలో విషాదఛాయలు అములుకున్నాయి. ఆయన మృతదేహనికి సీఆర్పీఎఫ్ సిబ్బందితో పాటు, స్థానికులు నివాళులర్పించారు. ఆదివారం ప్రభుత్వ లాంఛనలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయనకు భార్యతో పాటు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రహదారి విస్తరణ ప్రారంభిస్తాం



రహదారిని పరిశీలిస్తున్న సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: షాద్‌నగర్ పట్టణ చౌరస్తా నుంచి అన్నారం వై జంక్షన్ వరకు ఉన్న పాత జాతీయ రహదారి విస్తరణ పనులను త్వరలో ప్రారంభిస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచంద్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే గుంతలమయంగా మారిన పాత జాతీయ రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే మాట్లాడుతూ.. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా రహదారి నిర్మాణ పనులు పూర్తి కాలేదని అన్నారు. కొత్తూరు మండల కేంద్రం నుంచి షాద్‌నగర్ పట్టణ చౌరస్తా వరకు రోడ్డును విస్తరణ పనులు పూర్తి చేసి మిగతా పనులు వదిలేశారని అన్నారు. అయితే షాద్‌నగర్ చౌరస్తా నుంచి అన్నారం వైజంక్షన్ వరకు రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్డు విస్తరణ పనుల గురించి ఇటీవల ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు, కాంట్రాక్టర్‌తో చర్చించమన్నారు. రోడ్డు విస్తరణకు ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. త్వరలో రోడ్డు విస్తరణ పనులను ప్రారంభిస్తామన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, వెంకట్‌రాంరెడ్డి, పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, కృష్ణ, బాల్‌రాజ్‌గౌడ్, ఖదీర్, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణప్రతిష్ఠను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలి

వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి బండారి రమేశ్



శంకర్‌నగర్ కాలనీలో కార్యక్రమానికి చేపడుతున్న ఏర్పాట్లు

షాద్‌నగర్‌రూరల్: అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) రాష్ట్ర కార్యదర్శి బండారి రమేశ్ పిలుపునిచ్చారు. సోమవారం నిర్వహించనున్న ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి వివిధ దేవాలయాలలో భక్తులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆయా దేవాలయాలను శుభ్రం చేయడంతో పాటుగా వీధిదీపాల ఏర్పాటు, కాషాయ జెండాలు, మామిడి తోరణాలతో ఆలయాలను ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. పురుషోత్తముడైన బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా జరుగుతుందన్నారు. 500 సంవత్సరాలుగా లక్షలాది మంది హిందూ వీరుల త్యాగం, దశాబ్దాల విశ్వహిందూ పరిషత్ కరసేవకుల బలిదానాల ఫలితంగా నేడు అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ శాంతియుత వాతావరణంలో జరుగుతుందన్నారు. దేశంలోని ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని దీపావళి పండుగలా జరుపుకోవాలని కోరారు. ఉదయం 10 గంటలకు సమీపంలోని దేవాలయాలకు చేరుకొని హనుమాన్ చాలీసా పారాయణం, శ్రీరామ భజనలు చేయాలని, అయోధ్యలో రాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని వీక్షించాలని అన్నారు. సాయంత్రం ఐదు గంటలకు ఇంటి ముందు 5 దీపాలను వెలిగించాలని కోరారు. ప్రజలందరూ రాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని కోరారు.